సాక్షి బాపట్ల

గురువారం ǀ 22 ǀ జూన్ ǀ 2023



కిడాంబి శ్రీకాంత్‌కు సత్కారం

నగరంపాలెం(గుంటూరు): బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిడాంబి శ్రీకాంత్‌ను బుధవారం 18వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ సత్కరించారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.800, గరిష్ట ధర రూ.2,000, మోడల్ ధర రూ.1,200 వరకు పలికింది.

పల్నాడు వ్యాప్తంగా వర్షం



నరసరావుపేట: పల్నాడు జిల్లాలో బుధవారం సాయంత్రం వర్షం కురిసింది. దీంతో చల్లని గాలులతో వాతావరణం చల్లబడింది. ప్రజలు సేదదీరారు.

న్యూస్‌రీల్

ముగిసిన డీఎంహెచ్‌ఓ వైద్య సిబ్బంది కౌన్సెలింగ్



గుంటూరు మెడికల్ : ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న వైద్య సిబ్బందికి బుధవారం సాధారణ బదిలీల కౌన్సెలింగ్‌ను గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నిర్వహించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు చెందిన ల్యాబ్ టెక్నీషియన్, ల్యాబ్ అటెండెంట్, డ్రైవర్, తోటి, స్వీపర్, ఆపరేషన్ థియేటర్ అటెండెంట్, ఫీమేల్ నర్సింగ్ ఆర్డర్లీ, ఆఫీస్ సబార్డినేట్, క్లాస్–4, ఫ్యామిలీ వెల్ఫేర్ వర్కర్, ఫ్యామిలీ ప్లానింగ్ వర్కర్ పోస్టులకు కౌన్సెలింగ్ చేసి ఆయా అభ్యర్థులు కోరుకున్న ప్రదేశాలకు బదిలీ చేశారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు అధ్యక్షతన జరిగిన కౌన్సెలింగ్ ప్రక్రియలో బాపట్ల డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయమ్మ, డెప్యూటీ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ జి.చంద్రశేఖర్, డాక్టర్ ఇ.అన్నపూర్ణ, ఎన్‌హెచ్‌ఎం డీపీఎంఓ డాక్టర్ సి.హెచ్.రత్నమన్మోహన్, డీఐఓ డాక్టర్ సుబ్బరాజు, ఏఓ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

40 మంది స్టాఫ్ నర్సులు బదిలీ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ నుంచి 40 మంది స్టాఫ్ నర్సులు బుధవారం బదిలీ అయ్యారు. గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయంలో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల స్టాఫ్‌నర్సులు, హెడ్‌నర్సులు, ఫార్మాసిస్టులకు సాధారణ బదిలీల కౌన్సెలింగ్ జరిగింది. ఒంగోలులో పనిచేస్తున్న 25 మంది, నెల్లూరులో పనిచేస్తున్న 12 మంది స్టాఫ్‌నర్సులు బదిలీ అయ్యారు. మూడు జిల్లాల పరిధిలో 122 మంది నర్సులు, 12 మంది హెడ్‌నర్సులు బదిలీ అయ్యారు. ఆర్డీ డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్, డెప్యూటీ డైరెక్టర్ అంజయ్య, ఆఫీస్ సూపరింటిండెంట్లు గోపవరపు స్టాన్లీ రాజ్‌కుమార్, సుధీర్, సీనియర్ అసిస్టెంట్లు, పాల్, సుబ్బారావు కౌన్సెలింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. గుంటూరు జీజీహెచ్ వార్డులో గతంలో మంజూరైన స్టాఫ్‌నర్సుల పోస్టులు కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయవద్దంటూ పలువురు కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు ఆర్డీ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గతంలో మంజూరైన పోస్టులు భర్తీ చేస్తున్నామని అధికారులు ప్రకటించడంతో కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు వెనుదిరిగారు.

వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ శ్రీధర్



గుంటూరు మెడికల్ : గుంటూరు వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ బోరా శ్రీధర్‌ని నియమిస్తూ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీలి ఉమాజ్యోతి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ శ్రీధర్ గుంటూరు వైద్య కళాశాల పెథాలజీ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కళాశాలలో 2006 నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేసి ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. వైస్ ప్రిన్సిపాల్‌గా నియమితులైన డాక్టర్ శ్రీధర్‌ను పెథాలజీ వైద్యులు, వైద్య కళాశాల ఇతర విభాగాలకు చెందిన వైద్యులు, కార్యాలయ ఉద్యోగులు అభినందించారు.

43,386 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరుమార్కెట్ యార్డుకు బుధవారం 40,866 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 43,386 బస్తాలు అమ్మకాలు జరిగాయి.

- నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9 వేల నుంచి రూ.24 వేల వరకు పలికింది.
- నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9 వేల నుంచి రూ.24,200 వరకు పలికింది.
- ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాల్‌కు రూ.10,500 నుంచి 22 వేల వరకు ధర లభించింది.
- ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,500 నుంచి రూ. 24,200 వరకు ధర పలికింది.
- తాలు రకం మిర్చికి రూ.5 వేల నుంచి రూ.14 వేల వరకు ధర లభించింది.

అమ్మకాలు ముగిసే సమయానికి ఇంకా 15,755 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.



శుభ యోగా

అంతర్జాతీయ యోగా దినోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాజకుమారి, ఎమ్మెల్యే ముస్తఫా, మేయర్ కావటి మనోహర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. యోగా అద్భుత ప్రక్రియ అని, దీనివల్ల సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, ఒత్తిడి దూరమవుతుందని కలెక్టర్ చెప్పారు.

- సాక్షి నెట్‌వర్క్



బస్‌మాసుర హస్తం

- భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో బాబు వంచనయాత్ర
- గతంలో అధికారం వెలగబెట్టినా జన క్షేమం పట్టలేదే!
- మరోమారు అబద్ధపు హామీలతో సిద్ధమైన పచ్చపార్టీ
- టీడీపీ బస్ యాత్రను పట్టించుకోని ప్రజలు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: అధికారమే పరమావధిగా టీడీపీ చేపట్టిన భవిష్యత్తుకు గ్యారెంటీ బస్ యాత్రను జనం ఛీదరించుకుంటున్నారు. అధికారం వెలగబెట్టినప్పుడు ప్రజల కష్టాలను పట్టించుకోని చంద్రబాబు ఇప్పుడు మళ్ళీ గద్దెనెక్కేందుకు వంచనకు సిద్ధం కావడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఫలితంగా బస్‌యాత్రకు స్పందన కరువైంది. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు పేద, బడుగు, బలహీనవర్గాల అభివృద్ధిని కాంక్షించలేదు. వ్యవసాయమే దండగని చెప్పి ఆ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారు. సాగునీటి వనరులను పట్టించుకోలేదు. దీంతో అన్నదాతలు రోడ్డున పడ్డారు. సాగు, తాగునీరు లేక ప్రజలు అల్లాడిపోయారు. ప్రకృతి కరుణించక కరువు విలయ తాండవం చేసింది. ఎన్నికల ముందు చెప్పిన రైతు, డ్వాక్రా రుణ మాఫీలకు బాబు ఎగనామం పెట్టారు. అప్పటి వరకూ ఉన్న సంక్షేమ పథకాల్లో కోత పెట్టారు. అభివృద్ధి పనులను విస్మరించారు. ఆయన పాలనలో అవినీతి అక్రమాలకు అడ్డేలేకుండా పోయింది. నీరు–చెట్టు పేరుతో ప్రజాధనాన్ని టీడీపీ కార్యకర్తలకు దోచిపెట్టారు. దీంతో విసిగివేసారిన ప్రజలు గత ఎన్నికల్లో చిత్తుగా ఓడించి చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పారు.



ప్రజలు లేక వెలవెలబోతున్న టీడీపీ బస్సు యాత్ర

మళ్ళీ అధికారం కోసం బాబు పాట్లు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని సంక్షేమ ప్రభుత్వ నాలుగేళ్ల పాలనా కాలం ముగిసి ఎన్నికలు సమీపిస్తుండటంతో రాబోయే ఎన్నికల్లో ఎలాగైనా నెగ్గి అధికారం చలాయించేందుకు చంద్రబాబు నానా తంటాలు పడుతున్నారు. జనాన్ని మాయమాటలతో వంచించేందుకు కుయుక్తులు, కుట్రలకు తెరతీశారు. ఇందుకోసం కొత్త అబద్ధపు హామీలను తెరపైకి తెస్తున్నారు. వాటిని పదేపదే చెప్పి ప్రజలను నమ్మించేందుకు సిద్ధమయ్యారు. ఇందుకోసం భవిష్యత్తు గ్యారెంటీ పేరుతో ఎక్కడికక్కడ బస్సుయాత్రలను ఆ పార్టీ నేతలు చేపట్టారు. టీడీపీని గెలిపిస్తే మూడు వంటగ్యాస్ సిలిండర్లు అట, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో టికెట్లు లేవట, నిరుద్యోగులకు భృతి అట, మహిళలకు డబ్బులు, రైతులకు డబ్బులు ఇలా.. ఏవేవో చెబుతున్నారు. జనాన్ని నమ్మించేందుకు నానా పాట్లు పడుతున్నారు.

గతంలో ప్రజల నెత్తిన చెయ్యి

గతంలో అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు ప్రస్తుత బాపట్ల జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధిని పట్టించుకోలేదు. ప్రజల నెత్తిన చెయ్యిపెట్టారు. దీనికి ఈ ఉదంతాలే నిదర్శనం.

- రేపల్లె నియోజకవర్గంలో మత్స్యకారుల ప్రయోజనార్థం ఫిషింగ్ హార్బర్ నిర్మించాలన్నది స్థానికుల చిరకాల కల. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి అంకురార్పణ చేశారు. చంద్రబాబు సీఎం అయ్యాక దానిని పక్కన బెట్టారు. 2019లో అధికారం చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కాగానే రూ.451 కోట్లతో ఫిషింగ్ హార్బర్ పనులు మొదలు పెట్టారు. ప్రస్తుతం పనులు శరవేగంగా సాగుతున్నాయి.
- పర్చూరు నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న 25 ఎత్తిపోతల పథకాలకు నిధులిచ్చి అభివృద్ధి చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చి మాట తప్పారు. పర్చూరు వాగు అభివృద్ధినీ గాలికి వదిలేశారు. దీంతో సాగర్ చివరి ఆయకట్టుకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.
- అద్దంకి నియోజకవర్గంలోని ఎర్రంచినపోలిరెడ్డి, కొరిశపాడు ఎత్తిపోతల పథకాలను అభివృద్ధి చేస్తానని చెప్పిన చంద్రబాబు ఆ తరువాత వాటిని పట్టించుకోలేదు. ఇక భవనాశి రిజర్వాయరు నిర్మాణానికి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి శిలాఫలకం వేయగా ఆ తరువాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు దాన్ని పక్కనబెట్టారు. దీంతో వేలాది ఎకరాల ఆయకట్టుకు నీరందని దుస్థితి. అద్దంకి పట్టణం తాగునీటి అవసరాల కోసం గుండ్లకమ్మ రిజర్వాయరు నుంచి నీటిని అందిస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు పట్టుమని పదిశాతం పనులూ పూర్తిచేయలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఈ పథకం పనులు పూర్తిచేస్తున్నారు.
- చీరాల నియోజకవర్గంలో చేనేతలు అధికంగా ఉన్నారు. ఒక్కొక్కరికీ రూ.1.50 లక్షలతో ఇళ్ల, మగ్గంషెడ్డు నిర్మిస్తామని, జిల్లాకు చేనేత పార్కు నిర్మిస్తామని గతంలో హామీ ఇచ్చిన చంద్రబాబు దానిని నేరవేర్చలేదు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో చేనేతల కోసం కేటాయించిన పార్కుస్థలం అభివృద్ధికి బాబు ప్రభుత్వం నిధులివ్వలేదు. ఉచిత ఆరోగ్యబీమా కల్పిస్తామని చెప్పి అప్పటికే అమలులో ఉన్న ఐసీసీఐ లోంబార్డ్ ఇన్సూరెన్స్ పథకాలను రద్దుచేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే బాబు పాపాల జాబితా చేంతాడంత. ఇప్పుడు మళ్లీ అధికారం కోసం నానా హామీలు ఇస్తున్నారు.

'నిన్ను నమ్మం బాబూ'

టీడీపీ హామీల సంగతెరిగిన ప్రజలు చంద్రబాబును, ఆ పార్టీ నేతలను చూసి నవ్వుపోతున్నారు. మరోమారు మీ మాయమాటలు నమ్మి మోసపోయేది లేదంటూ బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో చంద్రబాబు ఆదేశాల మేరకు మంగళవారం బాపట్ల జిల్లా వ్యాప్తంగా బస్సుయాత్ర ప్రారంభించిన నాయకులు విస్తుపోతున్నారు. ఎక్కడా జన స్పందన లేక తలలు పట్టుకుంటున్నారు. తొలిరోజు బాపట్లలో నీరసంగా యాత్ర సాగింది. రెండో రోజు బుధవారం చీరాలలోనూ ప్రజలు లేక వెలవెలబోయింది. 22న పర్చూరులో, 23న సంతనూతలపాడు నియోజకవర్గాల్లో ఈ యాత్ర సాగనుంది. పక్క నుంచే టీడీపీ బస్సు వెళుతున్నా ప్రజలు అటువైపు తొంగికూడా చూడడంలేదు. జగనన్న ప్రభుత్వం అన్నీ ఇస్తుంటే కొత్తగా మీరొచ్చి ఇచ్చేదేముందని బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. టీడీపీ వంచన యాత్రపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల ఆనందమే లక్ష్యం కావాలి



ఇసుక దరిశిలో రుణం అందజేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

- మార్టూరు పర్యటనలో కలెక్టర్ రంజిత్ బాషా
- ఉపాధ్యాయుడిగా మారి.. విద్యార్థులకు బోధన

మార్టూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులు 100 శాతం సంతృప్తి చెందేలా అధికారులు పనిచేయాలని కలెక్టర్ రంజిత్ బాషా చెప్పారు. స్థానిక గన్నవరం రోడ్డులోని జగనన్న లే అవుట్‌లో బుధవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన 550 పట్టాలు కలిగిన లే అవుట్‌లో గృహనిర్మాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. మౌలిక వసతుల గురించి లబ్ధిదారులు ప్రస్తావించగా అన్ని సదుపాయాలూ సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. డ్వాక్రా సంఘాల ద్వారా మంజూరైన రూ. 35 వేల రుణాలను పంపిణీ చేశారు. మొదట ఇసుక దరిశి గ్రామంలో రూ.1.60 కోట్ల నాడు– నేడు నిధులతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మితమవుతున్న ఏడు తరగతి గదులు, మరుగుదొడ్లు, ప్రహరీలను పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. రోజూ అందించే మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. కాసేపు గణిత ఉపాధ్యాయుడిలా మారి పాఠాలు బోధించారు. అందరూ మంచి ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. అనంతరం ఇసుక దరిశి, మార్టూరులోని జగనన్న లే అవుట్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. మార్టూరు సచివాలయం –3 ను, తండాలోని రైతు భరోసా కేంద్రాలను సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. బాపట్ల ఆర్డీఓ గంధం రవీందర్, డీఎల్‌డీఓ సువార్తమ్మ, తహసీల్దార్ బి.వెంకటరెడ్డి, ఎంపీడీఓ కృష్ణకుమారి, ఎంఈఓ వస్రాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతతోనే నేరాల అదుపు

- ఈనెల 24లోపు ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఈ–బీట్ సిస్టమ్ అమలు చేయాలి
- ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశం



కంప్యూటర్ ఆపరేటర్లకు టెక్నాలజీపై అవగాహన కల్పిస్తున్న ఐటీకోర్ అధికారులు

బాపట్లటౌన్: సాంకేతికతతోనే నేరాలు అదుపుచేయగలమని ఎస్పీ వకుల్‌జిందాల్ చెప్పారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని కంప్యూటర్ ఆపరేటర్లకు సాంకేతిక పరిజ్ఞానంపై బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతోందని, నేర నియంత్రణకు ఎంతగానో దోహదపడుతోందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా ప్రవేశపెట్టి ఏపీ కాప్స్, ఈ–బీట్ వ్యవస్థపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. పోలీస్ స్టేషన్లలోని కంప్యూటర్ ఆపరేటర్లు, ఇన్‌స్పెక్టర్లు, రైటర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్టు వెల్లడించారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 24లోపు ఈ–బీట్ సిస్టమ్ అమలు చేయాలని ఆదేశించారు. జిల్లా ఐటీ కోర్ టీం విభాగం అధికారులు ఏపీ కాప్స్, ఈ– బిట్స్ వ్యవస్థ విధానం ఉపయోగాలు, ఎలా అమలు చేయయాలి అనే అంశాలపై వివరించారు. ఉన్నతాధికారులు తమ మొబైల్ ఫోన్‌లో సీఎఫ్‌ఎంఎస్ ఐడీతో ఏపీ కాప్స్ అప్లికేషన్‌కు ఇన్‌స్టాల్ చేయించి ఈ–బీట్ సిస్టమ్‌ను పర్యవేక్షించాలని సూచించారు.

వీఆర్వో కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్ట్

- కటకటాల వెనక్కు ఆరుగురు
- మరో ఇద్దరి కోసం గాలింపు
- వివరాలు వెల్లడించిన చీరాల డీఎస్పీ ప్రసాదరావు



కిడ్నాప్ వివరాలు వెల్లడిస్తున్న చీరాల డీఎస్పీ ప్రసాదరావు చిత్రంలో సీఐ సూర్యనారాయణ

చినగంజాం: చినగంజాం మండలం పెదగంజాం గ్రామ రెవెన్యూ అధికారి అమ్మనబ్రోలు వెంకట సుబ్రహ్మణ్యం కుమార్ కిడ్నాప్ కేసులో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు చీరాల డీఎస్పీ ఎస్.ప్రసాదరావు తెలిపారు. బుధవారం సాయంత్రం చినగంజాం పోలీస్ స్టేషన్‌లో కేసు వివరాలను డీఎస్పీ వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. పెదగంజాం పల్లెపాలెంకు చెందిన కొక్కిలగడ్డ విష్ణునారాయణ (మాజీ జెడ్పీటీసీ), ఈపూరుపాలెంకు చెందిన మద్దూరి ప్రసాద్, అదే గ్రామానికి చెందిన అనుభం సాయి ముగ్గురూ కలిసి కొంతకాలంగా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో బ్రోకరేజ్ చేస్తున్నారు. ఏడాదిగా రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోవడంతో ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ముగ్గురూ కలిసి సులువుగా డబ్బు సంపాదించాలనుకున్నారు. వారికి అప్పటికే పరిచయం ఉన్న పెదగంజాం వీఆర్వో సుబ్రహ్మణ్యంను లక్ష్యంగా ఎంచుకున్నారు. అనంతరం నేర చరిత్ర ఉన్న చీరాలకు చెందిన మానుపాటి సాయితేజను సంప్రదించారు. ఈపూరుపాలెం గ్రామానికి చెందిన పూండ్ల సాయి అలియాస్ గుండు సాయి, అదే గ్రామానికి చెందిన గోర్పుని సాంబశివ, చిలకలూరిపేటకు చెందిన పంట వంశీ అలియాస్ వంశీకృష్ణారెడ్డి, చీరాలకు చెందిన యారం సుమన్‌ను కలుపుకొని ముందస్తు ప్రణాళిక ప్రకారం కిడ్నాప్‌కు పాల్పడ్డారు. కడవకుదురు గ్రామంలో పొలం ఉందని, దాని కొలతలు వేయాలని చెప్పి వీఆర్వో సుబ్రహ్మణ్యంకు ఫోన్ చేసి మే 31న మధ్యాహ్నం 12 గంటలకు అతనిని తహసీల్దార్ కార్యాలయం వద్ద కారులో ఎక్కించుకొని కిడ్నాప్‌కు పాల్పడ్డారు. పథకం ప్రకారం అతడిని పొదిలి నుంచి గిద్దలూరు వెళ్ళే దారిలోని అటవీ ప్రాంతంలోకి తీసుకు వెళ్లి చెట్టుకు కట్టివేసి కర్రలతో కొట్టి హింసించారు. వారు పెట్టే బాధలకు తాళలేని వీఆర్వో వారు కోరినట్టు బంధువుల ద్వారా రూ. 1,78,000 ఏర్పాటు చేయడంతో అది తీసుకున్న కిడ్నాపర్లు ఈ నెల 4వ తేదీ రాత్రి 9 గంటల ప్రాంతంలో అతడిని సంతనూతలపాడు బస్టాండ్ వద్ద వదిలిపెట్టి వెళ్ళిపోయారు.

ప్రత్యేక బృందాలతో దర్యాప్తు

ఇంటికి చేరుకున్న వీఆర్వో ఈనెల 5న ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు చీరాల డీఎస్పీ ప్రసాదరావు నేతృత్వంలో ఇంకొల్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.సూర్యనారాయణ రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇంకొల్లు సర్కిల్ నుంచి ఓ బృందం, చినగంజాం ఎస్‌ఐ సురేష్ ఆధ్వర్యంలో మరో బృందంగా ఏర్పాటయ్యారు. సాంకేతిక పరిజ్ఞానంతో బుధవారం ఆరుగురిని అరెస్ట్ చేశారు. కిడ్నాప్‌కు ఉపయోగించిన రెండు కార్లు, రూ. 5 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిని రిమాండ్ నిమిత్తం చీరాల కోర్టుకు హాజరు పరిచారు. మరో ఇద్దరు నిందితులు అనుభం సాయి, మనుపాటి సాయి తేజ పరారీలో ఉన్నారు. ప్రత్యే బృందాలు గాలిస్తు న్నాయి. నిందితులను చాకచక్యంగా పట్టుకొన్న సీఐ వి.సూర్యనారాయణ, ఎస్‌ఐ కె.సురేష్, కానిస్టేబుల్ బాల, దేవరకొండ శ్రీను, నాగరాజును ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.

వైద్య ఘనకీర్తి.. ఖండాంతర ఖ్యాతి

- గుంటూరు వైద్య కళాశాలకు 77 వసంతాలు
- 1946 జూన్ 22న ప్రారంభమైన విద్యాలయం
- అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ
- ఎన్నడూలేని విధంగా ఒకేసారి 52 సీట్లు మంజూరు



గుంటూరు వైద్య కళాశాల

గుంటూరు మెడికల్: హస్తవాసిగల ఎందరో వైద్యులను అందించిన ఘనత వైద్య కళాశాల సొంతం. 77 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో మైలురాళ్లను దాటింది. దినదిన ప్రవర్ధమానమై ముందుకు సాగుతోంది. 1946 జూన్ 22న అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఆచంట రుక్మిణమ్మ, ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు చొరవతో ఈ కళాశాల ఏర్పాటైంది.

తొలి రోజుల్లో 50 మంది మాత్రమే

కళాశాల తొలి బ్యాచ్‌లో కేవలం 50 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు బయటకు వచ్చారు. 1960 నాటికి ఈ సంఖ్య 150కి, 2013 నాటికి 200కి, ప్రస్తుతం 250కి చేరింది. తొలి రోజుల్లో తరగతులు ఆంధ్రా క్రిస్టియన్ కళాశాలలో జరిగేవి. క్లినికల్ కోర్సుల కోసం విశాఖపట్నం, మద్రాసుకు విద్యార్థులు వెళ్లాల్సి వచ్చేది. 1954 నుంచి గుంటూరు వైద్య కళాశాలలో క్లినికల్ కోర్సులు ప్రారంభించారు.

191 పీజీ సీట్లు

సూపర్ స్పెషాలిటీ, స్పెషాలిటీ వైద్య విభాగాలన్నీ కలిపి 32 వరకు జీజీహెచ్‌లో, వైద్య కళాశాలలో ఉన్నాయి. తొలుత 79 పీజీ సీట్లు మాత్రమే ఉండగా 2010–11 విద్యా సంవత్సరంలో వాటి సంఖ్య 97కు పెరిగింది. 2022 నాటికి 145 ఉండగా, ప్రస్తుతం 191కు పెరిగాయి. ప్రస్తుతం ఏటా వంద మందికిపైగా పారామెడికల్ కోర్సులు అభ్యసిస్తున్నారు. ఇక్కడి విద్యనభ్యసించిన రెండువేల మందికిపైగా వైద్యులు అమెరికాలో, 400 మంది యునైటెడ్ కింగ్‌డమ్‌లో స్థిరపడి సేవలందిస్తున్నారు.

ఎందరో వైద్య ఉద్దండులను తీర్చిదిద్దిన ఘనత

ఎందరో వైద్య ఉద్దండులను ఈ కళాశాల తీర్చిదిద్దింది. భారత వైద్య మండలి(ఎంసీఐ) అధ్యక్షుడిగా పనిచేసిన డాక్టర్ పి.నరసింహారావుతోపాటు పద్మశ్రీ అవార్డు గ్రహీతలైన డాక్టర్ సి.ఎం.అబీబుల్లా, డాక్టర్ గుళ్లపల్లి నాగేశ్వరరావు, డాక్టర్ బి.సోమరాజు, డాక్టర్ డి.ప్రసాదరావు, డాక్టర్ ఆళ్ళ గోపాలకృష్ణ గోఖలే, డాక్టర్ యార్లగడ్డ నాయుడమ్మ, డాక్టర్ మన్నెం గోపీచంద్ ఈ కళాశాల విద్యార్థులే కావడం గమనార్హం. ఇంకా ఎందరో వైద్యులు, రాజకీయనేతలు, ఐఏఎస్ అధికారులు ఇక్కడ చదువుకుని ఉన్నత పదవులు అలంకరించారు. గుంటూరు వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న బోధనా ఆసుపత్రి, గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి దేశంలోనే ఐదో స్థానంలో నిలిచి కీర్తిబావుటా రెపరెపలాడిస్తోంది.

సీఎం జగన్ వరాలు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక కళాశాలపై అనేక వరాలు కురిపించారు. అభివృద్ధికి విశేష కృషి చేశారు. గత ఏడాది మెడికల్ కాలేజీ ప్లాటినం జూబ్లీ వేడుకల సందర్భంగా పైలాన్‌ను ఆయన దివ్యహస్తాల మీదుగా ఆవిష్కరించారు.

సీఎం కృషితో కళాశాల చరిత్రలో స్వర్ణయుగం



ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించాక గుంటూరు వైద్య కళాశాలకు స్వర్ణయుగం ప్రారంభమైంది. గతంలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులన్నీ భర్తీ అయ్యాయి. కొత్త పోస్టులూ మంజూరయ్యాయి. కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలు గత ఏడాది జరిపాం. ఒకేసారి 46 పీజీ సీట్లు, ఆరు సూపర్ స్పెషాలిటీ సీట్లు మంజూరు చేసిన ఘనత సీఎందే. నాడు– నేడు కార్యక్రమంలో భాగంగా రూ.500 కోట్లను కళాశాలకు సీఎం మంజూరు చేశారు.

– డాక్టర్ నీలి ఉమాజ్యోతి, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్

క్లుప్తంగా

ఎన్జీరంగా వర్సిటీని సందర్శించిన విదేశీ ఉన్నతాధికారులు

గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వ్యవసాయ స్థితిగతులను, ఆధునిక వ్యవసాయ విధానాలను రైతు స్థాయికి తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు తెలుసుకునేందుకు ఇథియోఫియా దేశ వ్యవసాయ ఉన్నతాధికారులు ఐదు రోజుల పర్యటనకు రాష్ట్రానికి రావటం జరిగిందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. బుధవారం నగర శివారుల్లోని లాం ఫాంలోని విశ్వవిద్యాలయాన్ని ఇథియోఫియా దేశ వ్యవసాయ ఉన్నతాధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలోని అప్సర డ్రోన్ సెంటర్‌ను సందర్శించారు.

వ్యవసాయంలో డ్రోన్ ప్రాముఖ్యత, డ్రోన్‌లను వ్యవసాయ యాజమాన్య పద్ధతులకు ఏవిధంగా వినియోగించాలి, శిక్షణ ఏవిధంగా ఇస్తున్నారు అనే విషయాలను వ్యవసాయ ఇంజినీరింగ్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎ.సాంబయ్య వివరించారు. అనంతరం వీసీ అధ్యక్షతన విశ్వవిద్యాలయం అధికారులు, శాస్త్రవేత్తలతో చర్చాగోష్టి నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రపంచ బ్యాంక్ సలహాదారులు డాక్టర్ హిమ్మత్ పటేల్, వ్యవసాయ శాఖ జేడీఏ శ్రీధర్, ఇథియోఫియా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు డాక్టర్ బెజాజేఅలి, ఇథియోఫియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ అన్యూలెం వాలెలేగ్న్‌హరేగు, సీనియర్ మేనేజర్ అబ్రహాం తెస్సాయే బెయేనే, అగ్రికల్చర్ అండ్ హార్టికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఎగ్జిక్యూటివ్ రేడియేట్ అరెగా సెమేగా, ఏటీఏ ఎల్సాడేబి లేటెడ్‌టైల హస్‌లు ఆధునిక వ్యవసాయ విధానాన్ని రైతులకు చేరవేసే విషయంలో వారి సందేహాలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు, పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎల్ ప్రశాంతి, విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎ సుబ్బరామిరెడ్డి, వ్యవసాయ పీఠాధిపతి డాక్టర్ పి.సుధాకర్, వ్యవసాయ ఇంజనీరింగ్, సాంకేతిక పీఠాధిపతి డాక్టర్ ఎ.మణి, గృహవిజ్ఞాన పీఠాధిపతి డాక్టర్ సీహెచ్ చిరంజీవి, విద్యార్థి కార్యకలాపాల పీఠాధిపతి డాక్టర్ పి.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పల్నాడుకు తలమానికంగా 'వరికపూడిసెల'



వరికపూడిసెల ప్రాంతాన్ని మంత్రి అంబటి రాంబాబుకు చూపుతున్న ఎంపీ లావు, ప్రభుత్వ విప్ పీఆర్కే.

- జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- త్వరలోనే పనుకు శంకుస్థాపన

వెల్దుర్తి: పలనాడు జిల్లాకు తలమానికంగా వరికపూడిసెల ఎత్తిపోతల పథక నిర్మాణ చేపట్టనున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. వరికపూడిసెల ప్రాంతాన్ని నరసరావుపేట ఎంపీ లావు కృష్ణదేవరాయలు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, కలెక్టర్ ఎల్.శివశంకర్, మూడు జిల్లాల వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలతో కలసి బుధవారం పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్నాటి ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేరుస్తూ వచ్చే నెల మొదటి వారంలో ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేయనున్నారని వెల్లడించారు. నరసరావుపేట ఎంపీ కృష్ణదేవరాయలు మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణానికి వైఎస్సార్ పల్నాటి దుర్భిక్ష నిర్మూలన కమిషన్ ద్వారా రూ.1,650 కోట్ల నిధులకు క్యాబినెట్ ఆమోదం పొందినట్లు వివరించారు. ప్రాజెక్టు నిర్మాణంతో వినుకొండ, మాచర్ల నియోజక వర్గాలలోని వెల్దుర్తి, దుర్గి, బొల్లాపల్లి, ప్రకాశం జిల్లాలోని పుల్లల చెరువు మండలంలోని 1.20లక్షల పొలాలకు సాగునీరు, వంద గ్రామాలకు తాగునీరు అందుతుందని వివరించారు. ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించిన అటవీ, రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్, పలు శాఖాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఎటువంటి అనుమతులు లేకుండానే మూడు సార్లు శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేశారు.యటం జరిగిందన్నారు. ఆ పథకం గురించి పట్టించుకోలేదన్నారు. రైతులు ఎదురుచూస్తున్న పథకానికి పనులు ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, గురజాల ఆర్డీఓ అద్దెయ్య, తహసీల్దార్ కోటేశ్వరరావునాయక్, ఎంపీడీఓ ప్రసాద్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శౌంటిరెడ్డి నర్సిరెడ్డి, మాచర్ల మున్సిపల్ చైర్మన్ తురక కిషోర్, వెల్దుర్తి, దుర్గి, మాచర్ల మండల పరిషత్ అధ్యక్షులు చింతా శివరామయ్య, యేచూరి సాయి శంకర్, బూడిద శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు పెద్ద మల్లుస్వామి, రూప్లీబాలునాయక్, పాల్గొన్నారు.

అమర్‌నాథ్ కుటుంబానికి అండగా ఉంటాం..

చెరుకుపల్లి: విద్యార్థి అమర్‌నాథ్ కుటుంబానికి అండగా ఉంటామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. బాపట్ల జిల్లా ఉప్పాలవారిపాలెంలో అమర్‌నాథ్ కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు. బాలుడి హత్యకు కారణాలను, సోదరితో నిందితులు ప్రవర్తించిన తీరుపై పూర్తి నివేదిక అందిచాలని పోలీస్‌శాఖను ఆదేశించినట్లు చెప్పారు. నివేదిక అందిన వెంటనే కమిషన్ ద్వారా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. బాలల హక్కులకు భంగం కలించే వారిపై కమిషన్ కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు. ఆమె వెంట గుంటూరు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు వాసంతి, సీడీపీఓ అనసూయ, ఎంఈఓ టి.నవీన్‌కుమార్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు గౌరి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం



యోగా శిబిరంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా



యోగా చేస్తున్న బాపట్ల వ్యవసాయ కళాశాల డీన్ డాక్టరు శ్రీనివాసరావు

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం ఉంటుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బాపట్ల క్రీడా వికాస కేంద్రం ఆవరణలో నిర్వహించారు. అధికారులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశంలో యోగాకు ప్రాచీన కాలం నుంచి ఎంతో ఆదరణ ఉందని చెప్పారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండడానికి యోగ చేయాలని సూచించారు. యోగాతో ఆరోగ్యం మెరుగు పడటమే గాకుండా మానసికంగా ధృఢపడతారని ఆయన వివరించారు. తొలుత యోగాతో కలిగే ప్రయోజనాలను ఆయుష్ శాఖ సీనియర్ వైద్యులు డాక్టర్ బాల ప్రభావతి వివరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, వ్యాధి నిరోధక శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ చంద్రశేఖర్ రెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం మదన్ మోహన్, జల వనరుల శాఖ ఎస్ఈ మురళీకృష్ణ పాల్గొన్నారు.

అద్భుతమైన ప్రక్రియ యోగా

బాపట్ల: శరీరాన్ని, మనసుతో అనుసంధానం చేసే అద్భుతమైన ప్రక్రియ యోగా ఒక్కటేనని వ్యవసాయ కళాశాల డీన్ డాక్టరు వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని వ్యవసాయ కళాశాలలోని ఇండోర్ స్టేడియం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యోగా సాధన విద్యార్థులకు అత్యంత ఆవశ్యకరమైన చెప్పారు. ఆందోళన, నిస్పృహ, ఒంటరితనం, ఆత్మన్యూనత వంటి మానసిక రుగ్మతలను యోగా ద్వారా అధిగమించవచ్చని చెప్పారు. ఆధునిక జీవన శైలిలో సర్వ సాధారణ సమస్యలైన మధుమేహం, అధిక రక్తపోటు, నడుం, మోకాళ్ల నొప్పులు వంటి ఎన్నో శారీరక సమస్యలకు యోగ ద్వారా పరిష్కారం లభిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ యోగా నిపుణులు అమిరపు నటరాజన్, జాన్ అగస్టీన్, కల్పన ఆధ్వర్యంలో యోగ శిక్షణ నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన, యోగ ప్రదర్శన పోటీలలో గెలుపొందిన విజేతలకు కళాశాల అసోసియేట్ శ్రీనివాసరావు, ఏ నటరాజన్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. కళాశాల జాతీయ సేవ పథకం అధికారులు డాక్టర్ కె.శ్రీనివాసులు, డాక్టర్ సి.సంధ్య రాణి, డాక్టర్ కె.విజయ ప్రకాష్, డాక్టర్ ఎం.లత, డాక్టర్ షేక్ హసీనా బాను పాల్గొన్నారు.

శివారు గ్రామాల్లో మొబైల్ టవర్లు

జిల్లా టెలికం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ప్రసన్న కుమార్



సదస్సులో పాల్గొన్న జనరల్ మేనేజరు ప్రసన్నకుమార్ తదితరులు

నరసరావుపేట: జిల్లా పరిధిలో సిగ్నల్స్ లేని శివారు గ్రామాల్లో మొబైల్ టవర్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు గుంటూరు టెలికం జిల్లా సేల్స్, మార్కెటింగ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎం.ఎస్. ప్రసన్న కుమార్ స్పష్టం చేశారు. స్థానిక ఎర్రాప్రగడ బీఎస్ఎన్ఎల్ టెలికాం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన వినియోగదారుల అవగాహన సదస్సులో మాట్లాడారు. నరసరావుపేట సబ్ డివిజన్ పరిధిలో 20 ఎక్స్ఛేంజీలు ఉన్నాయని, 2000 ల్యాండ్ లైన్ కనెక్షన్‌లు ఉన్నాయన్నారు. అంతేకాక 4,400 ఫైబర్ కనెక్షన్లు ఇంటింటికీ అందజేశామన్నారు. ఇప్పటికీ 15 వైఫై పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. డీఈ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రైవేట్‌తో ప్రమేయంలేకుండా చిలకలూరిపేట, నరసరావుపేటలలో కస్టమర్ సర్వీసు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎస్‌డీఓ నాగరాజు మాట్లాడుతూ వినియోగదారుల ఫిర్యాదులకు తక్షణమే స్పందిస్తున్నామన్నారు. జేటీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి వినియోగదారునికి తమ వంతుగా సేవలు అందిస్తున్నామన్నారు. టెలికాం సలహా కమిటీ ఉమ్మడి గుంటూరు జిల్లా సభ్యుడు నిమ్మరాజు చలపతి రావు మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్‌కు పూర్వ వైభవం చేకూరబోతున్నట్లు, ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా 4జీ, 5జీ సేవలు విస్తరించేందుకు వీలుగా బీఎస్ఎన్ఎల్‌కు రూ.89,047కోట్లు కేటాయించారన్నారు. టెలికం అధికారులు, వినియోగదారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాం

ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చామని ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాత్రి పట్టణంలోని రామిరెడ్డిపేటలో సన్నిధి ఫంక్షన్‌హాలులో బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఇచ్చిన హామీలన్నింటినీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మద్దతుతో నెరవేర్చినట్లు వివరించారు. నాడు- నేడు ద్వారా ప్రభుత్వం ప్రభుత్వ స్కూళ్లను ఏవిధంగా అభివృద్ధి చేసిందో, ఎంత ఖర్చుచేస్తున్నారో ఉపాధ్యాయులకు తెలిసిందేనని వివరించారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ టీచర్ల బదిలీలు ఎంతో పారదర్శకంగా చేసినట్లు చెప్పారు. ఇటీవల ఎంట్రన్స్ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన ఉపాధ్యాయుల పిల్లలను సన్మానించారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, ముదిరాజు కార్పొరేషన్ డైరెక్టర్, విద్యావేత్త ఈఎం స్వామి, జిల్లా సైన్స్ అధికారి ఏఏ మధుకుమార్, ఎంఈఓ ఎస్.నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు బీఎం సుభాని, ఆర్.గోవిందరాజులు, చిలకాప్రసాదు, ఎస్.వెంకటరావు, సుబ్బారెడ్డి, విక్రమ్‌సింగ్, చప్పల్లి కోటేశ్వరరావు, భూమిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

జీవితంలో గెలిచేందుకు విద్యార్థులు సిద్ధపడాలి

- విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య
- వర్సిటీలో బీటెక్ ఫస్టియర్ తరగతులు ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రత్తయ్య

చేబ్రోలు: విద్యార్థులు చదువులో మాత్రమే కాకుండా సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటేనే మంచి ప్రొఫైల్ డెవలప్ అవుతుందని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో బుధవారం బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థుల కు తరగతుల ప్రారంభోత్సవం జరిగింది. వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రు లు హాజరయ్యారు. చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ ఇప్పటివరకు విద్యార్థులు పరీక్షలు రాయడానికే మాత్రమే ప్రిపేర్ అయ్యేంటారని, ఇప్పటినుంచి జీవితంలో నెగ్గడానికి ప్రిపేర్ అవ్వాలన్నారు. రిజిస్ట్రార్ రఘునాథన్, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపక పాల్గొన్నారు.

నదిలో జారిపడి యువకుడి దుర్మరణం

పమిడిముక్కల(పామర్రు): గేదెలను మేపేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ కృష్ణా నదిలో జారిపడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం.. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం చింతల్లంక గ్రామానికి చెందిన మట్టా గోపాలకృష్ణ(20) కృష్ణాజిల్లా పమిడిముక్కల మండల పరిధిలోని లంకపల్లి రేవులోకి మంగళవారం మధ్యాహ్నం గేదెలను మేపేందుకు తోలుకొచ్చాడు. రాత్రి 7 గంటల ప్రాంతంలో గేదెలు మాత్రమే ఇంటికి వచ్చాయి. గోపాలకృష్ణ రాలేదు. దీంతో లంకపల్లి రేవు పరిసర ప్రాంతాల్లో వెతుకుతుండగా బుధవారం ఉదయం నదిలో శవమై తేలుతూ కనిపించాడు. మృతుడి స్వగ్రామం చల్లపల్లి మండలం వక్కలగడ్డ గ్రామంలోని ఎట్టివానిగూడెం అని, వ్యవసాయ పనుల నిమిత్తం కుటుంబమంతా చింతల్లంక గ్రామంలో ఉంటున్నారని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. మృతుడి తల్లి మట్టా సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఆర్పీఎఫ్ అధికారులకు పతకాలు



తెనాలిరూరల్: తెనాలి రైల్వే రక్షక దళం(ఆర్పీఎఫ్) అధికారులకు ఉన్నతాధికారుల ప్రశంసలతో పాటు పతకాలు అభించాయి. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఫతే అలీ బేగ్, ఏఎస్ఐ ఎం.శివ రామ కృష్ణయ్యలు పతకాలు పొందారు. హైదరాబాద్ సమీపంలోని మౌలాలిలో గల రైల్వే భద్రతా సిబ్బంది శిక్షణ కేంద్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ రాజారం నుంచి పతకాన్ని వీరు అందుకున్నారు. రైల్వే ఆస్తుల పరిరక్షణకు చేస్తున్న కృషిని ఉన్నతాధికారులు గుర్తించి వీరిరువురి పేర్లను ప్రతిపాదించారు. దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో రైల్వే భద్రతా విభాగంలో ఉత్తమ పని తీరు కనబరిచిన 185 మంది ఉద్యోగుల్లో ఫతే అలీబేగ్ ప్రశంసాపత్రం పొందగా, శివ రామకృష్ణయ్య ఉత్కృష్ట సేవా పతకం అందుకున్నారు.

24 నుంచి జిల్లాలో 'జగనన్న సురక్ష'

కలెక్టర్ శివశంకర్ లోతేటి

నరసరావుపేట: జిల్లాలో గ్రామ స్థాయిలో జూన్ 24 నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యంగా కార్యక్రమం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. తొలుత జూన్ 23 లోగా వలంటీర్లు, గ్రామ సారథులు, మండల స్థాయి అధికారులకు కార్యక్రమంపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. శిక్షణ పూర్తిచేసుకున్న సిబ్బంది జూన్ 24 నుంచి గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పథకాలు అందడంలో ఇబ్బందులు ఉంటే అక్కడికక్కడే సంబంధిత పత్రాల సేకరణ చేయనున్నట్లు వివరించారు. ప్రత్యేక యాప్ ద్వారా సమస్యను నమోదు చేసి వారం రోజుల తర్వాత నిర్వహించే జగనన్న సురక్ష క్యాంపులో సమస్యలు పరిష్కరిస్తామన్నారు. జగనన్న సురక్షను విజయవంతం చేయాలని జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులకు జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

మెప్మా, డీఆర్‌డీఏ పనితీరు మెరుగుపడాలి

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో ప్రభుత్వ సహకారంతో కొనసాగుతున్న పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా), జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థల పనితీరు మరింత మెరుగు పడాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో బుధవారం సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను వంద శాతం శాతం ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని, పథకాల్లో తరచుగా వస్తున్న సాంకేతిక సమస్యలను అధిగమించడంతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నవరత్నాలు - సంక్షేమ పథకాల అమలులో మెప్మా, జిల్లా డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతి పదం - జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థల ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకొని చర్చించారు. మెప్మా ఆధ్వర్యంలో సంస్థాగత భవనాల నిర్మాణం, బ్యాంకు లింకేజ్, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత, పీఎం స్వానిధి, టిడ్కో హౌసింగ్, పీఎంఏవైయూ, జగనన్న తోడు, జగనన్న కాలనీల నిర్మాణం, షెల్టర్ ఫర్ అర్బన్ హోమ్ లెస్ కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ అర్బన్ పరిధిలో పనిచేస్తున్న సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ వైయస్సార్ క్రాంతి పదం జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ బాలు నాయక్, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటనారాయణ పాల్గొన్నారు.